తెలంగాణ రాకుంటే సీఎం అయ్యేవాడివా?

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

హైదరాబాద్, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ 14 ఏండ్లు పోరాడి తెలంగాణ సాధించారని, ప్రత్యేక రాష్ట్రమే రాకపోతే రేవంత్‌రెడ్డి సీఎం అయ్యేవారా? అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఒక ప్రకటనలో ప్రశ్నించారు. వరంగల్ సభలో ఆసాంతం కేసీఆర్‌ను తిట్టడానికే కేటాయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు ఆ సభ ఏ ఉద్దేశంతో నిర్వహించారో ప్రజలకు అర్థం కాలేదని, అభివృద్ధిని అడ్డుకుంటే జైలుకు పంపిస్తామన్న రేవంత్‌రెడ్డి తెలంగాణలో అభివృద్ధి ఎక్కడ జరిగిందో ప్రజలు చెప్పాలని డిమాండ్ చేశారు. గిరిజనుల భూములను లాక్కొని నిర్మించాలనుకున్న ఫార్మాసిటీ ఎవరి కోసమో చెప్పాలని ప్రశ్నించారు. కేసీఆర్ ఒక మొక్క కాదు మహావృక్షమని పేర్కొన్నారు. 11 నెల పాలనలో రేవంత్‌రెడ్డి నోట బూతులు తప్ప నీతులు రాలేదని ఎద్దేవా చేశారు. ఏం సాధించారని సంబరాలు జరుపుకొంటున్నారని ప్రశ్నించారు.

రేవంత్ ఓ బ్లాక్‌మెయిలర్

- కేసీఆర్ మహావృక్షం
- ఎదుర్కొనే దమ్ము ఎవరికీ లేదు
- మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్



తుంగతుర్తి, నవంబర్ 20: ఓటుకు నోటు కేసులో పట్టుబడి జైలుకెళ్లిన రేవంత్‌రెడ్డి ఓ బ్లాక్‌మెయిలర్ అని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ విమర్శించారు. బుధవారం సూర్యాపేట జిల్లా అన్నారంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఏడాది కాలంలో సీఎం రేవంత్‌రెడ్డి పెట్టిన ఏ సభలోనైనా కేసీఆర్‌ను తిట్టకుండా ఉన్నారా అని ప్రశ్నించారు. కేసీఆర్ అనే మొక్కను తెలంగాణలో లేకుండా చేస్తానని రేవంత్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. కేసీఆర్ మహావృక్షం అని, పీకే దమ్ము రేవంత్‌రెడ్డికి లేదని స్పష్టంచేశారు.

హనుమకొండ రాంనగర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు. చిత్రంలో శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు టీ రాజయ్య, గండ్ర వెంకటరమణారెడ్డి, నన్నపునేని నరేందర్

విజయోత్సవ సభ కాదు.. వంచన సభ

- హామీలపై చేతులెత్తేసిన రేవంత్ ప్రభుత్వం
- శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనచారి
- తెలంగాణలో గంజాయి మొక్క రేవంత్‌రెడ్డి
- తెలంగాణకు కేసీఆర్ గొప్ప నాయకుడు: ఎర్రబెల్లి
- రేవంత్‌రెడ్డిది దుష్టపాలన: పల్లా

వరంగల్, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనపై విజయోత్సవాల పేరుతో వరంగల్‌లో నిర్వహించిన సభ పూర్తిగా వంచన సభ అని శాసనమండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి విమర్శించారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేతులు ఎత్తేసిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజానీకానికి చేసిన, చేస్తున్న ద్రోహానికి... ప్రత్యేకించి మహిళలకు రేవంత్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు టీ రాజయ్య, గండ్ర వెంకటరమణారెడ్డి, నన్నపునేని నరేందర్‌తో కలిసి మధుసూదనాచారి బుధవారం హనుమకొండలోని ఎర్రబెల్లి నివాసంలో మీడియాతో మాట్లాడారు. ఆరు గ్యారెంటీల్లో మొదటిది మహాలక్ష్మీ గ్యారెంటీ అని, మహిళలకు ప్రతి నెలా రూ.2500 ఇస్తామని ఇప్పటికీ అమలు చేయలేదని దుయ్యబట్టారు. 18 ఏండ్లు నిండి చదువుకునే ప్రతి విద్యార్థినికీ ఎలక్ట్రిక్ స్కూటర్లు ఇస్తామని చెప్పి మహిళా సభలో కనీసం ప్రస్తావించ లేదని మండిపడ్డారు. ప్రతి నిరుపేద ఆడబిడ్డ పెండ్లికి లక్ష రూపాయలతో పాటు ఇందిరమ్మ కానుక తులం బంగారం ఇస్తామని మోసం చేశారని చెప్పారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో రూ.4.25 లక్షల కోట్లు మాత్రమే అప్పు చేసిందని, కేసీఆర్ నాయకత్వంలో అన్ని రంగాల్లో ఉత్పాదక, సంపదను పెంచి తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చకుండానే 11 నెలల పాలనలో రూ.85 వేల కోట్ల అప్పులు చేసిందని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ ఘోర వైఫల్యానికి, అవగాహన, అనుభవ రాహిత్యానికి ఇదే నిదర్శనమని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆ పార్టీ అధిష్ఠానం అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని, సహచర మంత్రుల్లో సీఎంపై అసహనం పెరిగిపోతున్నదని, రాష్ట్ర ప్రజల్లో వ్యతిరేకత, దీనికితోడు సొంత నియోజకవర్గంలో ప్రజల తిరుగుబాటు మొదలైందని వివరించారు. ముఖ్యమంత్రులను మార్చే అలవాటున్న కాంగ్రెస్ సంస్కృతితో రేవంత్‌రెడ్డి పదవి తుమ్మితే ఊడే ముక్కేనని, దీనస్థితిలో ఉన్న రేవంత్‌రెడ్డి కేసీఆర్‌ను విమర్శించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. 25 ఏండ్లలో తెలంగాణ నలుమూలల వటవృక్షంలా వేళ్లూనుకున్న నాయకుడిని మొలకెత్త నివ్వ అనడం చూస్తే పిట్టల దొరకు రేవంత్‌రెడ్డికి తేడా లేదని తెలంగాణ ప్రజలు నవ్వుకుంటున్నారని సిరికొండ పేర్కొన్నారు.

ప్రజలే రేవంత్‌ను అవతల పడేస్తరు: ఎర్రబెల్లి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్థాయి దిగజారి నీచంగా మాట్లాడుతున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. రేవంత్‌రెడ్డి తెలంగాణలో గంజాయి మొక్క అని, ప్రజలే ఆ మొక్కను పీకి అవతల పడేస్తారని చెప్పారు. రేవంత్‌రెడ్డిని సొంత పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలే పట్టించుకోవడం లేదని, ప్రజలు వ్యతిరేకంగా ఉన్నారని తెలిపారు. మంత్రివర్గ విస్తరణ సైతం చేయలేని అసమర్థుడు రేవంత్‌రెడ్డి అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో ఉండి సోయి లేకుండా మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. ఓటమి ఎరుగని కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు గురించి మాట్లాడే స్థాయి రేవంత్‌రెడ్డికి లేదని చెప్పారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి పదేండ్లలో అన్ని రకాలుగా అభివృద్ధి చేసిన కేసీఆర్‌ను పీకి పారేస్తా అనడం రేవంత్‌రెడ్డి చిల్లర చేష్టలకు నిదర్శనమని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి చీటర్, బ్రోకర్ అని, అబద్ధాలు, మోసపు మాటలతో అధికారంలోకి వచ్చాడని దుయ్యబట్టారు. వరంగల్ బహిరంగసభలో సీఎం రేవంత్‌రెడ్డి తనను రాక్షసుడు అన్నారని, ప్రజల కోసం రాక్షసుడిలానే పని చేస్తానని దయాకర్‌రావు స్పష్టంచేశారు. ప్రజలు తనను ఏడుసార్లు వరుసగా గెలిపించారని, రేవంత్‌రెడ్డి ప్రతిసారి సీటు మారిస్తేనే గెలుస్తాడని ఎద్దేవా చేశారు. విజయోత్సవ సభలు పెట్టడం తర్వాత అని, మొదట కొడంగల్ నియోజకవర్గ ప్రజల గురించి పట్టించుకోవాలని హితవు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనంటూ ప్రజలను గాలికి వదిలేసిందని విమర్శించారు. కాళోజీ గురించి ఏం తెలుసని రేవంత్‌రెడ్డి మాట్లాడారని, వ్యక్తిగతంగా ఎప్పుడైనా కనీసం కలిశాడా? అని ప్రశ్నించారు.

రేవంత్‌రెడ్డిది దుష్టపాలన: పల్లా రాజేశ్వర్‌రెడ్డి

తెలంగాణలో రేవంత్‌రెడ్డి దుష్టపాలన కొనసాగిస్తున్నారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫైర్ అయ్యారు. వరంగల్ మహిళా సభలో రేవంత్‌రెడ్డి బూతు పురాణం చెప్పారని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలవుతాయనే ఆశతో సభకు వచ్చిన మహిళలను మరోసారి గోసపెట్టారని దుయ్యబట్టారు. కాళోజీ చరిత్రను అర్థం చేసుకోవడం రేవంత్‌రెడ్డి అజ్ఞానానికి సాధ్యం కాదని చెప్పారు. కేసీఆర్ తెలంగాణ వ్యవసాయాన్ని అభివృద్ధి చేస్తే.. రేవంత్‌రెడ్డి రైతులకు మోసం చేశాడని తెలిపారు. పాలన ఇలాగే కొనసాగిస్తే భవిష్యత్‌లో రేవంత్‌రెడ్డికి హిట్లర్, ముస్సోలిని, డయ్యర్‌కు పట్టిన గతే పడుతుందని పల్లా హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి తన అన్నదమ్ములకు రియల్ ఎస్టేట్ వదిలిపెట్టి.. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి పొంగులేటి ముగ్గురు కలిసి ఆంబోతుల్లా రాష్ట్రాన్ని దోచుకుతింటున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో వ్యవస్థలను నిర్వీర్యం చేశారని పేర్కొన్నారు. 15 శాతం కమీషన్లు ఇస్తేనే పెండింగ్ బిల్లులు మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దమ్ముంటే బెల్ట్‌షాపులను మూయించాలని సవాల్ విసిరారు. గ్రామాల్లో గుడుంబా ఏరులై పారుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణలో కేసీఆర్ అనే మహా వృక్షం నీడ ఎప్పుడూ రేవంత్‌రెడ్డిని వెంటాడుతుందని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి కూర్చున్న కుర్చీలోనూ ఆయనకు కేసీఆరే కనిపిస్తాడని, ఓరుగల్లు నుంచే రేవంత్‌రెడ్డి పతనం మొదలైతదని చెప్పారు. అసెంబ్లీలో తమనే తట్టుకోలేని రేవంత్‌రెడ్డి.. ఇక కేసీఆర్ వస్తే ఏం తట్టుకుంటాడని పల్లా సెటైర్లు వేశారు.

బుధవారం నందినగర్ నివాసంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ని కలిసిన టీటీడీ చైర్మన్ బీఆర్.నాయుడుకు శాలువా కప్పి.. వేంకటేశ్వర స్వామి జ్ఞాపికను అందచేశారు

తెలంగాణ లేఖలను పరిగణనలోకి తీసుకోండి

- ఇక్కడి ఎంపీ, ఎమ్మెల్యేల లేఖలతో ప్రజలకు తిరుమలలో శ్రీవారి దర్శనం కల్పించండి
- మర్యాదపూర్వకంగా కలిసిన టీటీడీ చైర్మన్‌కు కేటీఆర్ వినతి

హైదరాబాద్, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): తిరుమలకు వచ్చే తెలంగాణ భక్తుల దర్శనానికి ఇక్కడి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇచ్చే లేఖలను పరిగణనలోకి తీసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నందినగర్‌లోని నివాసంలో బుధవారం కేటీఆర్‌ను నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్వామివారి ప్రసాదాన్ని కేటీఆర్‌కు అందజేశారు. అనంతరం బీఆర్ నాయుడిని కేటీఆర్ శాలువాతో సత్కరించి శ్రీ వేంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేశారు. టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించినందుకు నాయుడుకు కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. కరీంనగర్‌లో ఒకచోట, సిరిసిల్లలో రెండు చోట్ల గతంలో శంకుస్థాపన చేసిన టీటీడీ దేవాలయాల నిర్మాణాలు శరవేగంగా పూర్తయ్యేలా సహకరించాలని కోరారు. తెలంగాణ వ్యాప్తంగా ఎన్నో ప్రసిద్ధి చెందిన ఆలయాలు ఉన్నాయని వాటి అభివృద్ధికి టీటీడీ తరపున తోడ్పాటు అందించాలని కోరారు. కేటీఆర్ విజ్ఞప్తులపై బీఆర్ నాయుడు సానుకూలంగా స్పందించారు. తప్పకుండా అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని నాయుడు హామీ ఇచ్చారు.

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్నమాజీ మంత్రులు పొన్నాల లక్ష్మయ్య, జోగు రామన్న, బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ తదితరులు

ప్రతిపక్షాన్ని తిట్టిపోయడమే సంబురమా?

- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై చర్చకు సిద్ధమా రేవంత్?
- మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య సవాల్
- అబద్ధాలకు చక్రవర్తి రేవంత్‌రెడ్డి: జోగు రామన్న
- మహా ఎన్నికల తర్వాత సీఎం కుర్చీ ఊస్ట్: దాసోజు శ్రవణ్

హైదరాబాద్, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డి అనే మొక్కను తెలంగాణ ప్రజలు కూకటివేళ్లతో పెకిలించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య విమర్శించారు. బీఆర్ఎస్‌ను రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేక, ప్రజలకిచ్చిన హామీల అమలు చేతగాక రేవంత్‌రెడ్డి దూషణలకు దిగుతున్నారని మండిపడ్డారు. ప్రతిపక్షాన్ని తిట్టిపోయడమే సంబురమా? అని నిలదీశారు. తెలంగాణభవన్‌లో బుధవారం మాజీ మంత్రి జోగు రామన్న, పార్టీ నేతలు దాసోజు శ్రవణ్, చాడ కిషన్‌రెడ్డి, మోయిన్‌ఖాన్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై తనతో చర్చకు వస్తావా రేవంత్? అని సవాల్ విసిరారు. వరంగల్‌లో కాళోజీ కళాక్షేత్రం నిర్మాణం కేసీఆర్ హయాంలోనే జరిగిందని, కేవలం రంగులు వేసి క్రెడిట్ తీసుకోవడానికి రేవంత్‌కు సిగ్గుండాలని ధ్వజమెత్తారు.

అబద్ధాల చక్రవర్తి రేవంత్: జోగు రామన్న

రేవంత్‌రెడ్డి అబద్ధాల చక్రవర్తిగా మారారని మాజీ మంత్రి జోగు రామన్న విమర్శించారు. రైతులకు రుణమాఫీ చేయడానికి ఖాతాల్లో తప్పులే కారణమని వరంగల్ సభలో మరోసారి అబద్ధం చెప్పారని మండిపడ్డారు. పార్లమెంటు ఎన్నికలకు ముందు ఇదే ఖాతాదారులకు రైతుబంధు వేశారు? ఇపుడు ఎందుకు సాంకేతిక సమస్య అడ్డంకిగా మారింది? అని నిలదీశారు.

సీఎం పదవి పోవడం ఖాయం: దాసోజు

మహారాష్ట్ర ఫలితాల తర్వాత రేవంత్ సీఎం పదవి ఊడటం ఖాయమని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా రేవంత్ అదానీతో కలిసి పోయారని విమర్శించారు. రేవంత్ తెలంగాణ పాలిట శాపంలా మారారని, రాజకీయాలను చిల్లర మల్లరగా మార్చారని ధ్వజమెత్తారు. కేసీఆర్‌తో రేవంత్ అభివృద్ధిలో పోటీ పడాలి, తలసరి ఆదాయం పెంచడంలో పోటీపడాలని అని సూచించారు.

బోనస్ ఎగ్గొట్టేందుకే కొనుగోళ్లలో జాప్యం

- అన్ని రకాల వడ్లకు 500 బోనస్ ఇవ్వాలి
- లేదంటే రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరుబాట: ప్రశాంత్‌రెడ్డి



నిజామాబాద్, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఎన్నికల సమ యంలో అన్ని రకాల వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు సన్న వడ్లకే ఇస్తామనడం రైతులను నిలువునా ముంచినట్టేనని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేము ల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్టు గొప్పగా చెబుతున్నా క్షేత్ర స్థాయిలో కొనుగోళ్ల వేగవంతంగా జరగడం లేదని బుధవారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. రైతు లు రోడ్లపైనే వడ్లను ఆరబోసుకుని, పడిగాపులు కాస్తున్నారని తెలిపారు. బోనస్ ఎగ్గొట్టడానికే ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేస్తున్నదని మండిపడ్డారు. రైతులతో కలిసి పోరుబాట పడుతుందని హెచ్చరించారు.

కాంగ్రెస్‌ది విషాద సభ

- కేసీఆర్ ఫ్యామిలీ జోలికొస్తే తెలంగాణ అగ్నిగుండమే
- మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ధ్వజం



ఖలీల్‌వాడి, నవంబర్ 20: రైతు డిక్లరేషన్ అమలు చేయలేని సీఎం రేవంత్‌రెడ్డి.. ఏ మొహం పెట్టుకుని వరంగల్‌లో సభ నిర్వహించారని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయడం రేవంత్‌రెడ్డికి సాధ్యం కాదన్నారు. వైఎస్, చంద్రబాబు, కిరణ్‌కుమార్‌రెడ్డికి పట్టిన గతే రేవంత్‌కు పడుతుందని హెచ్చరించారు. రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతున్నదని, ప్రజలంతా తిరగబడటం ఖాయమని అన్నారు. రానున్నది కేసీఆర్ ప్రభుత్వమేనని చెప్పారు. బుధవారం నిజామాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి వరంగల్ సభలో చేసిన వ్యా ఖ్యలపై తీవ్ర స్థాయి లో విరుచుకుపడ్డారు. 'వరంగల్‌లో జరిగింది విజయోత్సవ సభ కాదు, కాంగ్రెస్ విషాదసభ, ఆయన మాటలు విని అబద్ధమే సిగ్గుతో తలదించుకుంది' అని ఎద్దేవా చేశారు. మూసీ నది ప్రక్షాళనకు బదులు రైతులకు రుణమాఫీ చేయాలని, ఎన్నికల సమయంలో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు వరంగల్ సభలో రైతు డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి అదే వరంగల్‌లో సీఎంగా విజయోత్సవ సభలు ఎలా నిర్వహిస్తారని మండిపడ్డారు.

రిజిస్ట్రేషన్ల రద్దు ఉత్తర్వులు అనాలోచిత చర్య

- ప్రజల తరపున సుప్రీంకోర్టులో పోరాడుతాం
- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి, నవంబర్ 20: రిజిస్ట్రేషన్లను రద్దు చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మౌలాలి డివిజన్‌లోని పీబీ కాలనీ, సూర్యనగర్, రాక్‌హిల్స్ కాలనీ, హరిజన బస్తీ, షఫీనగర్, సాదుల్లానగర్, సుభాష్ నగర్‌లలో రిజిస్ట్రేషన్లు నిలిపివేయడంతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఉత్తర్వులకు వ్యతిరేకంగా నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏండ్ల కిందట ఈ కాలనీలు ఏర్పడ్డాయని, ఇప్పటికే రోడ్లు, డ్రైనేజీలు, నల్లా కనెక్షన్లు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ప్రజలు కూడా అన్ని పన్నులు కడుతున్నారని, ఇప్పుడు హఠాత్తుగా రిజిస్ట్రేషన్లు నిలిపివేయడం ప్రభుత్వ అనాలోచిత చర్య అని మండిపడ్డారు. ప్రజల పక్షాన హైకోర్టు, సుప్రీంకోర్టులో పోరాడుతానని చెప్పారు. కార్యక్రమంలో అమీనుద్దీన్, భాగ్యనందరావు, ఉస్మాన్, వంశీ, ఇబ్రహీం, సంతోష్‌నాయుడు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణకు కాలకేయుడిలా రేవంత్

- బాహుబలి కేసీఆర్ చేతిలో ఓటమి తప్పదు
- ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం
- విజయోత్సవ సభ కాదు.. రేవంత్ బూతుల సభ: చల్లా ధర్మారెడ్డి



బుధవారం తెలంగాణ భవన్లో మీడియాతో మాట్లాడుతున్నఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, చిత్రంలో కె.వాసుదేవ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డి తెలంగాణకు కాలకేయుడిలా మారారని, బాహుబలి కేసీఆర్ చేతిలో రేవంత్ రాజకీయ జీవితం పరిసమాప్తం కావడం ఖాయమని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తన కళాక్షేత్రాన్ని తెలంగాణ ద్రోహి రేవంత్ ప్రారంభించినందుకు కాళోజీ ఆత్మ క్షోభించి ఉంటుందని ఆవేదన వ్యక్తంచేశారు. కాళోజీ ట్రస్టు సభ్యులు వినతి పత్రం ఇద్దామనుకున్నా రేవంత్ సమయం ఇవ్వలేదని, కనీసం కవులు, కళాకారులను సన్మానించలేదని మండిపడ్డారు. ముందుగా కాళోజీకి రేవంత్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో బుధవారం మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, బీఆర్ఎస్ నేత వాసుదేవరెడ్డితో కలసి పోచంపల్లి మీడియాతో మాట్లాడారు. 2014లో కేసీఆర్ అధికారంలోకి రాగానే కాళోజీ ట్రస్టుకు నాలుగున్నర ఎకరాల భూమి, కళాక్షేత్రం నిర్మాణానికి రూ.35 కోట్లు విడుదల చేశారని చెప్పారు. భవన నిర్మాణం 95 శాతం కేసీఆర్ హయాంలోనే పూర్తయిందని, కేవలం రంగులు వేసి ప్రారంభించానని రేవంత్ చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. కల్వకుర్తి జిల్లా టీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి హోదాలో రేవంత్ కేసీఆర్‌ను పొగడుతూ ఇచ్చిన పేపర్ యాడ్‌ను ఈ సందర్భంగా మీడియాకు చూపించారు. తన అవసరాన్ని బట్టి నేతలను పొగడటం, తిట్టడం రేవంత్‌కు అలవాటే అని ధ్వజమెత్తారు.

సీఎం రేవంత్ బూతుల సభ: చల్లా

వరంగల్‌లో జరిగింది ప్రజాపాలన విజయోత్సవ సభ కాదని, సీఎం రేవంత్ బూతుల సభ అని చల్లా ధర్మారెడ్డి విమర్శించారు. హామీలు ఏం నెరవేర్చారని సభ పెట్టారు? అని నిలదీశారు. రుణాలు రావాలంటే సభకు రావాల్సిందేనని ఒత్తిడి చేసి సభకి రప్పించారని మండిపడ్డారు. సచివాలయం గేటు మారుస్తున్నారు.. కొంపదీసి రేవంతే కట్టారని శిలాఫలకం వేస్తారా? అని అనుమానం వ్యక్తం చేశారు. కేసీఆర్ గురించి పిచ్చిగా మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

మానుకోట సభకు అనుమతివ్వరట

- లగచర్ల బాధిత రైతులకు గిరిజనుల సంఘీభావంపై కన్నెర్ర
- మహబూబాబాద్‌లో మహాధర్నాకు అనుమతి నిరాకరణ
- భగ్గుమన్న బీఆర్ఎస్ శ్రేణులు
- ఎస్పీ ఆఫీస్ ఎదుట అర్ధరాత్రి వరకు బైఠాయింపు
- పోలీసులతో వాగ్వాదం, ఉద్రిక్తత
- మహాధర్నా తాత్కాలిక వాయిదా

విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, చిత్రంలో తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాలోత్ కవిత, శంకర్‌నాయక్ తదితరులు

మహబూబాబాద్, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): లగచర్ల బాధిత రైతులకు సంఘీభావంగా మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ గురువారం తలపెట్టిన మహాధర్నాపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొననున్న గిరిజన రైతు ధర్నాకు చివరి నిమిషంలో పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో ఈ కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు బీఆర్ఎస్ నేతలు ప్రకటించారు. కోర్టు అనుమతులు పొంది త్వరలో 50 వేల మందితో మహాధర్నా నిర్వహిస్తామని స్పష్టంచేశారు. మహాధర్నా కార్యక్రమం తలపెట్టినప్పటి నుంచి బీఆర్ఎస్ శ్రేణులు అనుమతుల కోసం దరఖాస్తు చేశారు. ఈ నేపథ్యంలో ధర్నాకు అనుమతి ఇస్తామని, ఏర్పాట్లు చేసుకోండంటూ చివరి నిమిషం వరకూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తక్కళ్లపల్లి రవీందర్రావు, సత్యవతి రాథోడ్‌తో పాటు ఇతర నాయకులకు పోలీసు అధికారులు చెప్తూ వచ్చారు. దీంతో నాయకులు ధర్నా నిర్వహించే ప్రదేశాన్ని బుధవారం పరిశీలించారు. అనంతరం జిల్లా పార్టీ కార్యాలయంలో ప్రెస్‌మీట్ నిర్వహించి ధర్నాకు వచ్చే రైతుల సంఖ్య, ప్రోగ్రాం వివరాలు వెల్లడించారు. బుధవారం రాత్రి 7 గంటల వరకు కూడా అనుమతి ఇవ్వకపోవడంతో బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు సత్యవతిరాథోడ్, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, పోచంపల్లి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీ, జిల్లా పార్టీ అధ్యక్షురాలు మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు భరత్‌కుమార్‌రెడ్డి ఎస్పీ క్యాంపు కార్యాలయానికి వెళ్లారు. అక్కడ కాలయాపన చేసిన ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ అనుమతి ఇవ్వడం కుదరదని చెప్పారు. శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని ఒకసారి, పెద్దల ఒత్తిడి ఉన్నదంటూ మరోసారి చెప్తూ అనుమతి నిరాకరించారు.

బీఆర్ఎస్ శ్రేణుల ఆగ్రహం

మహాధర్నాకు ఏర్పాట్లు చేసుకోండని చెప్పిన ఎస్పీనే అనుమతి నిరాకరించడంపై బీఆర్ఎస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ, పోలీసుల వైఖరిని నిరసిస్తూ ఎస్పీ క్యాంపు కార్యాలయం ఎదుట బైఠాయించారు. గిరిజన రైతులు, ఉద్యమకారులు, కార్యకర్తలు భారీ ఎత్తున చేరుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాత్రి 11 గంటల వరకు ఎస్పీ క్యాంపు కార్యాలయం ఎదుట టెంట్ వేసి అక్కడే బైఠాయించారు.

భయపడ్డావా.. రేవంత్? -కేటీఆర్ ట్వీట్

మానుకోట గిరిజన రైతు ధర్నాకు ప్రభుత్వం అనుమతి నిరాకరించడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఘాటుగా స్పందించారు. 'మాటకోసారి కేసీఆర్ రావాలి అంటూ రంకెలు వేస్తున్న రేవంత్‌రెడ్డి.. నేను మానుకోట సభకు వెళ్తానంటే ఎందుకు భయపడుతున్నవు?' అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

రేవంత్‌రెడ్డిలో వణుకు పుట్టింది

రేవంత్‌రెడ్డికి వణుకు పుట్టింది. మానుకోటలో బీఆర్ఎస్ ధర్నా చేస్తే రాష్ట్రం అంతటా ప్రజలు ధర్నాలు మొదలు పెడతారనే అనుమతి ఇవ్వడం లేదు. గిరిజనుల సమస్యలపై శాంతియుతంగా ధర్నా చేసుకుంటామంటే అనుమతి ఇవ్వకపోవడం దారుణం.

– సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ

పర్మిషన్ ఇవ్వకపోవడం దారుణం

మహబూబాబాద్ జిల్లా గిరిజన సంఘాల నేతలు కేటీఆర్‌ను సంప్రదించడంతో కార్యక్రమానికి పిలుపునిచ్చాం. ఈ విషయాన్ని మొదటనుంచీ జిల్లా ఎస్పీకి చెప్తే పర్మిషన్ ఇస్తానని చెప్పారు. తీరా ధర్నా సమయానికి అనుమతి ఇవ్వకం పోవడం దారుణం.

–పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ

హక్కులను హరిస్తున్న రేవంత్‌రెడ్డి

హక్కుల కోసం ప్రజాస్వామ్యయుతంగా పోరాటం చేసేందుకు రాజ్యాంగం అవకాశం కల్పించింది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రాజ్యాంగం కల్పించిన హక్కులను కూడా హరించి వేస్తున్నది.

–తక్కళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్సీ